క్లుప్తంగా

పరీక్ష సామగ్రి పంపిణీ

జనగామ: పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 47 మంది 10వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అందించిన పరీక్ష సామగ్రిని బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు, ఎంఈఓ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుగుల నర్సింహులు, నాయకులు అంజద్ పాషా, బొట్ల శంకర్ ఉన్నారు.

ఎంక్రోచ్‌మెంట్ల తొలగింపు



జనగామ: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఏసీపీ దామోదర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతి తో కలిసి ఏసీపీ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఆర్టీసీ బస్టాండు పరిధిలో ఉన్న ఎంక్రోచ్ మెంట్లను పూర్తిగా తొలగించారు. ఆర్టీసీ సంస్థ అద్దెకు ఇచ్చిన షెట్టర్లలోనే నిర్వహణ చేసుకోవాలని, ముందుకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో నిర్వాహకులు ఎంక్రోచ్ మెంట్లను తొలగించి, సామగ్రిని మరోచోటకు తరలించారు. కాగా, ఫుట్‌పాత్ ఆక్రమణలను సైతం తొలగించారు.

విరాళం



నర్మెట: మండలంలోని మచ్చుపహాడ్‌లో గొల్ల కురుమల సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి నిర్మాణాన్ని చేపట్టారు. కాగా, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బుధవారం పార్టీ శ్రేణులతో కలసి హాజరైన బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్ రూ. 5,116 విరాళంగా అందించారు. జిల్లా మండల బాధ్యులు సాక్కం అనిల్ కుమార్, కొన్నె రాజు, జహంగీర్, పోలు రాజు, నక్క సంపత్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ పరిశీలన



బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌ను తహసీల్దార్ విశాలాక్షి బుధవారం పరిశీలించారు. స్టోన్ క్రషర్ నుంచి వెలువడే భారీ పేలుడు శబ్దాలకు, దుమ్మూధూళితో చుట్టుపక్కల పంట పొలాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అలాగే పలువురి ఇళ్లు బీటలు వారుతున్నాయని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్రషర్‌ను పరిశీలించామని, దీనికి సంబంధించిన నివేదికను ఆర్డీఓ కార్యాలయానికి పంపిస్తామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఖాసీం, ఆర్‌ఐ శ్రీనివాస్, సుమర్, యాకయ్య ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



జనగామ: జనగామ పట్టణంలోని 30 వార్డుల్లో రూ.25 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల అమలుపై బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్ పర్యటించారు. వార్డుల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు, వాటి గుర్తింపు, కొత్తగా చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సేకరించారు.

నియామకం



వేణుగోపాల్‌గౌడ్

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన వేముల వేణుగోపాల్ గౌడ్ ను బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. వేణుగోపాల్ ఐదు సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ యువమోర్చా సోషల్ మీడియాలో కీలకంగా పని చేసినందులకు ఆయనకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. తనపై నమ్మకంతో సభ్యుడిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం అందజేత

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల మృతి చెందిన గుగ్గిళ్ల సోమయ్య కుటుంబానికి బుధవారం ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య క్వింటాల్ బియ్యం అందజేశారు. అదేవిధంగా కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



జనగామ రూరల్: ఎగ్జిబిట్లను తిలకిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున



జనగామ: ఎగ్జిబిట్‌పై వివరిస్తున్న విద్యార్థులు



తరిగొప్పుల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సబ్జెక్ట్‌లపై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సమస్యల పరిష్కారానికి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ రూరల్: వడ్లకొండలో జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



జనగామ రూరల్: గానుగుపహడ్‌లో ..



జనగామ రూరల్: సెయింట్ మేరీస్‌లో..



చిల్పూరు: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



జఫర్‌గఢ్: కూనూర్ పాఠశాలలో..



జఫర్‌గఢ్ ఉన్నత పాఠశాలలో..



కొడకండ్ల: నివాళులర్పిస్తున్న కస్తూర్బా సిబ్బంది

హుండీ ఆదాయం రూ.1.81 లక్షలు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ, జిట్టెగూడెం గ్రామాల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ ఆదాయం రూ.1,81,150 వచ్చినట్లు వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. తాటికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, జాతర చైర్మన్ కె.మహేందర్, రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల పెద్దల సమక్షంలో హుండీల లెక్కింపు బుధవారం చేపట్టారు. హుండీల లెక్కింపులో మొత్తం రూ.1,81,150 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు మారపాక రాములు, బానోతు రవీందర్, నాయకులు కుసుమ రమేష్, సిద్దుల సుదర్శన్, బర్మ రాజయ్య, నాగరాజు, గౌరేష్, కారోబార్ సలీమ్, పోకల నరేష్, బాబురావు, జయపాల్‌తో వివిధ పార్టీల నాయకులు, కులసంఘాల పెద్దలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బచ్చన్నపేట: చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బుధవారం చేరారు. ఆయనకు ప్రతాప్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జంగిటి విద్యానాథ్, మేకల రాజు, వేముల వెంకట్‌గౌడ్, దిడ్డిగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుగువారం పండుగ



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం జాతరలో తిరుగువారం పండుగలో భక్తులు



చిల్పూరు: లింగంపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధిలోని చింతగట్టు సమ్మక్క–సారలమ్మ, తాటికొండ, రంగరాయగూడెం గ్రామాల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో గద్దెల వద్ద భక్తులు బుధవారం వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క–సారలమ్మ జాతర తిరుగువారం సందర్భంగా అమ్మవార్ల గద్దెల వద్ద బోనాలను సమర్పించి, కోళ్లను కోసి మొక్కులు అప్పగించారు. సమ్మక్క–సారలమ్మ తిరుగువారం పండుగతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇప్పగూడెం జాతరలో జాతర కమిటీ మాజీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, నాయకులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మునిగెల రమేష్, కత్తుల కట్టయ్య, పల్లె రవీందర్, మంద రాజు, కుంట మల్లేశం, మందపురం బాష, లింగనబోయిన వెంకటేశ్వర్లు, మందపురం శివాజీ, శివరాత్రి సారంగం, వెంకటమల్లు పాల్గొనగా తాటికొండ జాతరలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, నాయకులు కె.మహేందర్, మారపాక రాములు, బానోత్ రవీందర్, జయపాల్ పాల్గొన్నారు.

లింగంపల్లిలో..

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతర తిరుగువారం పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని బొడ్రాయి నుంచి జాతర గద్దెలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ చిందం వంశి, రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, ఎంపీటీసీ కంకటి రవి, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, కండ్లకోలు బాలరాజు, వద్దుల కుమార్, అపరాదపు రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్పూరులో జరిగిన తిరుగువారంలో చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, గనగోని నవీన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు

జనగామ: కలెక్టర్ రిజ్వాన్ బాషాను టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖాజా షరీఫ్, పెండెల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, ముస్లిం నాయకులు ఎండీ సమ్మద్, మసీఉర్ రెహమాన్ తదితరులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అలాగే ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ కలెక్టర్‌ను కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు.



కలెక్టర్‌తో టీఎన్‌జీఓ నాయకులు



మున్సిపల్ చైర్‌పర్సన్



అభిగౌడ్



కలెక్టర్‌తో ముస్లింలు



టీఎస్ యూటీఎఫ్ నాయకులు

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న తిరుపతి

బచ్చన్నపేట: టైలర్ వృత్తినే నమ్ముకొని చాలీచాలని జీవితాలను వెళ్లదీస్తున్న టైలర్లను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని టైలర్ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గాలి తిరుపతి అన్నారు. బుధవారం టైలర్స్ డే సందర్భంగా మండలంలోని కేసిరెడ్డిపల్లిలో సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ టైలర్లకు జీవనోపాధి కోసం ఉచిత కుట్టు మిషన్లను అందిస్తూ రెడీ మేడ్ వ్యవస్థను నియంత్రించాలన్నారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లతోపాటు ఇళ్లను కూడా మంజూరు చేయాలని కోరారు. కనుకయ్య, రాజయ్య, ఎల్లయ్య, బీరయ్య, గాలి రాజు, మల్లయ్య, అభయ్, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: టైలర్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మేరు సంఘం మండల అధ్యక్షుడు కీర్తి రాజ్‌కమల్ కోరారు. మేరు సంఘం ఆధ్వర్యాన టైలర్స్ డే సందర్భంగా జెండాను ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్‌ను సృష్టించిన విలియమ్ ఎలియాస్ హో జన్మదినం పురస్కరించుకుని టైలర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కమల్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన మేరు కులస్తులను బీసీ–ఏ లో చేర్చాలని అన్నారు. ప్రతి కుటుంబానికి ఆటో మెటిక్ జుకి మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి సోమ సత్యం, మండల కార్యదర్శి కొత్తకొండ వాసు, మండల సహాయ కార్యదర్శి లెనిన్, సోమరాములు పాల్గొన్నారు.

గ్యారంటీలపై 'కళాజాతా'



కళాజాతాలో బాలయ్య బృందం

చిల్పూరు: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు అవుతున్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీం లీడర్ గడిపె బాలయ్య అన్నారు. మండలంలోని లింగంపల్లిలో బుధవారం సమ్మక్క తిరుగువారం సందర్భంగా టీఎస్ఎస్ కళాకారులు కళాజాతా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీలపై పాటల రూపంలో ప్రజలకు వివరించారు. గద్దర్ సాంబయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, చిరంజీవి, ముక్కెర సంపత్, ఎడవెళ్లి విజయ పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న పండితులు

జనగామ: జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఆవరణలోని చెన్నకేశవ ఆలయంలో బుధవారం శ్రీభూ నీలా సహిత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం కనులారా తిలకించేందుకు వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. కళ్యాణ వేడుక అనంతరం ఉత్సవ మూర్తులతో ఆలయంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హారతులు పట్టి, ఒడి బియ్యం సమర్పించి, ఆశీస్సులు అందుకున్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



చిల్పూరు: ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో టీచర్లు

జనగామ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఈఓ రాము అన్నారు. బుధవారం మండలంలోని ఓబుల్‌కేశవాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏఎంఓ శ్రీనివాస్, చంద్రబాను, హెచ్‌ఎం వీరాంజనీ తదితులు పాల్గొన్నారు.

చిల్పూరు: స్వయంపాలన కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభ పెంపొందుతుందని హెచ్‌ఎం రవిబాబు అన్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను హెచ్‌ఎం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంద్రు శ్రీదేవి, శోభారాణి, సరస్వతి, కల్యాణి, రమేష్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. హెచ్‌ఎం గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురం, ఆలింపూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. హెచ్‌ఎంలు చంద్రశేఖర్, యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

తొర్రూరు సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం

పాలకుర్తి టౌన్: తొర్రూరు సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డిపై అవిశ్వాసానికి తీర్మానం చేస్తూ పది మంది డైరెక్టర్లు సంతకాలు చేసి బుధవారం డీసీఓకు తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యం కమిషన్లు, ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అవిశ్వాసం తీర్మానంతో చైర్మన్‌కు నోటీసులు జారీ చేయాలని డీసీఓను డైరెక్టర్లు కోరారు.

ల్యాబ్‌లో ప్రింట్ రిపోర్టు ఇవ్వడం లేదు

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రక్త పరీక్ష ల్యాబ్‌లో ప్రింట్ రిపోర్టులను ఇవ్వడం లేదని జనగామ మండలం ఎల్లంల గ్రామానికి చెందిన వై.వినోద్ బుధవారం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. రక్త పరీక్ష చేసుకున్న వారికి సెల్‌ఫోన్ మెసేజ్ ద్వారా లింక్ పంపిస్తున్నారని, ప్రింట్ కాపీలు కావాలని అడిగితే యంత్రాలు పని చేయడం లేదని చెబుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆత్మగౌరవ సదస్సు జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ అణగారిన వర్గాల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని జిల్లా బీసీ రాజ్యాధికార సమితి ప్రచార కార్యదర్శి చింతకింద కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

'వలస వచ్చిన వారే పార్టీని వీడుతున్నారు'

బచ్చన్నపేట: బీఆర్ఎస్‌లోకి వలస వచ్చిన వారే నేడు పార్టీని వీడుతున్నారని, వారితో పార్టీకి ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కొందరు ఇతర పార్టీలకు కోవర్టుల్లా పని చేశారని వారితో పార్టీకి ముప్పే అని అన్నారు. ప్రస్తుతం ఆలాంటి నాయకులే పార్టీని వీడి వేరే పార్టీలో చేరుతున్నారన్నారు.

ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

బచ్చన్నపేట: మూడు దశాబ్దాల పోరాట ఆకాంక్ష మాదిగ ఉపకులాల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ నెరవేరే సమయం ఆసన్నమైందని, ఈ సమయంలో జాతి భవిష్యత్‌కు మాదిగలంతా ఏకమై ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంఎస్‌పీ, ఎంపీపీఎస్ అనుబంధ విభాగాల సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అల్వాల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఒగ్గు రవికి డాక్టరేట్

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు, ఉస్తాద్ ఒగ్గు రవికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ నుంచి బుధవారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా, గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఒగ్గు కథ– నాటకీయ లక్షణాలు అనే పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించగా అందుకు విశ్వవిద్యాలయ డాక్టరేట్ పట్టాను అందించారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్మెట: మండలంలోని అమ్మాపురంలో 220 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

రైతుల డిమాండ్లను నెరవేర్చాలి

చిల్పూరు: పంటలకు మద్దతు ధర ప్రకటించాలంటూ ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తుంటే వారి డిమాండ్లను నెరవేర్చాల్సిన ప్రధాని మోదీ వారిపై లాఠీచార్జీ చేయించడం దారుణమని కిసాన్‌సెల్ జిల్లా నాయకుడు మామిడాల యాదవరెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా చేపట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్తూ చిన్నపెండ్యాల గ్రామంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బట్టమేకల లక్ష్మయ్య అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

లింగాలఘణపురం: మండలంలో ఎంపీ పసునూరి దయాకర్ నిధులు రూ.14లక్షలతో మండల కేంద్రం, వనపర్తి, పటేల్‌గూడెం, మాణిక్యాపురం గ్రామాల్లో గ్రామానికి రెండు చొప్పున హైమాస్ట్ లైట్లను బుధవారం జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి ప్రారంభించారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

తరిగొప్పుల: మండలంలోని బొత్తలపర్రె గ్రామంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరంపై ఎస్సై అయ్యల శ్వేత బుధవారం దాడులు చేపట్టారు. మండలంలోని బొత్తలపర్రెలో భూక్య రంగమ్మ గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించగా గుడుంబా తయారు చేస్తూ పట్టుబడినట్లు తెలిపారు. సదరు మహిళ వద్ద నుంచి 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

బండి సంజయ్‌ని కలిసిన మండల అధ్యక్షుడు

చిల్పూరు: ప్రజాహిత యాత్రలో భాగంగా కొత్తకొండకు చేరుకున్న ఎంపీ బండి సంజయ్‌ను చిల్పూరు మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

రిజర్వాయర్ల ద్వారా చెరువులు నింపాలి

రఘునాథపల్లి: భూగర్భజలాలు అడుగంటి ఎండుతున్న పంటలను కాపాడేందుకు రిజర్వాయర్ల ద్వారా మండలంలోని చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం నాయకుడు తహసీల్దార్ పురం యుగేందర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురంలో ఆర్‌వీఎం ఆస్పత్రి గజ్వేల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.

విజయవంతం చేయాలి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో మార్చి 2న నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతిని విజయవతం చేయాలని ఉత్సాహ కమిటీ చైర్మన్ జాటోత్ హమ్యానాయక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

విజయ సంకల్పయాత్రను..

దేవరుప్పుల: బీజేపీ విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమ నరసయ్య పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన యాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తరిగొప్పుల: ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. అంకుషాపూర్ గ్రామానికి చెందిన దేవరాజుల ఎల్లయ్య(53) ఒంటరిగా ఉంటూ గంపలు అల్లి విక్రయిస్తుండు. కాగా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య, కుమారుడు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్వేత మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

కొడకండ్ల: డివైడర్‌ను కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలకేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన వంగపండ్ల కృష్ణ కారులో వంశీ, సందీప్‌లతో కలిసి మండలకేంద్రానికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవింగ్ చేస్తున్న కృష్ణ కాలు విరుగగా సందీప్ తలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

దేవునిగుట్ట క్వారీ లీజు రద్దు చేయాలి

దేవరుప్పుల: వానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట ఏరియాలో క్వారీ అనుమతులను రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్ బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హర్షం

జఫర్‌గఢ్: హైకోర్టు ఏజీపీగా వెంకటాపూర్‌కు చెందిన కట్టా రాధా సందీప్‌రెడ్డి నియమితులు కావడం పై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మంచాల ఎల్లయ్య హర్షం వ్యక్తం చేశారు.